సాక్షి అనంతపురం

శనివారం । 29 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.39 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.39 వేలు పలికాయి.



నార్పల టు లడఖ్

నార్పలకు చెందిన యువకుడు బైక్‌పై దేశాన్ని చుట్టివచ్చాడు. కష్టాలకోర్చి 177 రోజులకు తన సాహసయాత్ర ముగించి స్వస్థలం చేరుకున్నాడు. IIలో

గరిష్టం/కనిష్టం 41.8°/24.5°

జిల్లా అంతటా శుక్రవారం ఉక్కపోత అధికంగా ఉంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది.

మూగజీవాలకు ప్రాణదానం

- అరుదైన శస్త్రచికిత్సలు చేస్తున్న పశువైద్య బృందాలు
- వైఎస్సార్ సంచార పశువైద్యశాలలతో పెరిగిన సేవలు
- 1962 హెల్ప్‌లైన్‌తో బాధిత జీవాలకు తక్షణం వైద్యం
- ఇప్పటి వరకు 26 వేల మూగజీవాలకు వైద్యసహాయం





ఎద్దుకు శస్త్రచికిత్స చేస్తున్న డాక్టర్ పద్మనాభం, కుక్కకు శస్త్రచికిత్స చేస్తున్న డాక్టర్ సునీత

అనంతపురం అగ్రికల్చర్:

▸ శింగనమల మండలం బండమీదపల్లి రైతు సుధాకర్‌కు చెందిన ఎద్దు మెడ పైభాగం, అగ్రు భాగంలో పెద్ద కణితి ఏర్పడింది. కాడిమోయడానికి ఆరు నెలలుగా తీవ్ర ఇబ్బంది పడేది. 1962 సేవలు తెలుసుకున్న సుధాకర్... హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఎద్దు పడుతున్న బాధ, కణితి గురించి తెలియజేశారు. వైఎస్సార్ సంచార వాహనం ద్వారా ఎద్దును శింగనమల పశువుల ఆస్పత్రికి తీసుకొచ్చి ఏడీ డాక్టర్ పద్మనాభం, 1962 డాక్టర్ మౌనికతో పాటు సిబ్బంది రజియాబేగం, శ్రీలక్ష్మి, చంద్రశేఖర్, పవన్ తదితరులు శస్త్ర చికిత్స చేసి విజయవంతంగా రెండు కిలోల కణితిని తొలగించి.. తిరిగి అంబులెన్స్‌లో రైతు సుధాకర్ ఇంటి వద్దకు చేర్చారు.

▸ విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న శివకుమార్‌కు చెందిన పెంపుడు కుక్క ప్రమాదవశాత్తు గాయపడి పేగులు బయటకు వచ్చాయి. బతకడం కష్టమని భావించి చివరి ప్రయత్నంగా అనంతపురం సాయినగర్ పశువుల ఆస్పత్రికి తీసుకు వచ్చారు. అక్కడ ఏడీ డాక్టర్ సురేష్, 1962 డాక్టర్ సునీత తదితరులు పరిశీలించి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం మత్తు మందు ఇచ్చారు. అయితే ఉన్నట్టుండి 40 సెంటీమీటర్ల పొడవున్న పేగు ముక్కను కుక్క వాంతి చేసుకుంది. బయటకు వచ్చిన పేగుల్లో కొంత భాగాన్ని అదే కుక్క తిన్నట్లు గుర్తించారు. మింగిన పేగు ముక్కను శుభ్రపరిచి దాన్ని అతికించి విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. అరుదైన శస్త్రచికిత్సతో కుక్కను బతికించిన డాక్టర్ల బృందానికి శివకుమార్ థ్యాంక్స్ చెప్పారు.

▸ మండల కేంద్రం బొమ్మనహాళ్‌లో రైతు ఎర్రగుంట్ల వెంకటేష్‌కు చెందిన గర్భంతో ఉన్న ఆవు ఈనే క్రమంలో తీవ్ర ఇబ్బంది పడుతుండటంతో పశువుల డాక్టర్‌కు సమాచారం ఇచ్చారు. దూడను బయటకు తీయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో 1962 వాహనం ద్వారా అనంతపురం పశువుల ఆస్పత్రికి తీసుకువచ్చి శింగనమల ఏడీ డాక్టర్ పద్మనాభం బృందం అత్యవసర శస్త్రచికిత్స చేసింది. గర్భ ద్వారం చిన్నదిగా ఉండటం వల్ల ఈనలేక ప్రాణాపాయ స్థితికి చేరుకోవడంతో శస్త్రచికిత్స అనివార్యమైంది. దీంతో ఆపరేషన్ చేశారు.

ఇలా పశువులు, గేదెలు, జీవాలు, ఇతర మూగజీవాలకు డాక్టర్ వైఎస్సార్ మొబైల్ అంబులేటరీ క్లినిక్‌లు అత్యాధునిక వైద్య సేవలందిస్తున్నాయి.

పశుసంపద, జీవ సంపద పరిరక్షణ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ప్రతిష్టాత్మకంగా 2022 మే 19న అమలులోకి తెచ్చిన డాక్టర్ వైఎస్సార్ మొబైల్ అంబులేటరీ క్లినిక్‌లు పాడి రైతులు, జీవాల కాపర్ల పాలిట వరంగా మారుతున్నాయి. 108 తరహాలో పశువులకు కూడా 1962 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి మారుమూల ప్రాంతాల్లో సైతం విశిష్ట సేవలు అందిస్తున్నారు. గతేడాది నియోజకవర్గానికి ఒకటి చొప్పున కేటాయించగా... ఈ ఏడాది జనవరి 26న అదనంగా మరో వాహనం కేటాయించడంతో పల్లెసీమల్లో పశు వైద్యసేవలు మరింత అందుబాటులోకి తెచ్చారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 1962 టోల్‌ఫ్రీ నంబరు ఆధారంగా అత్యాధునిక మొబైల్ క్లినిక్‌ల ద్వారా సేవలు అందిస్తున్నారు. అలసత్వం చేయకుండా అరుదైన శస్త్రచికిత్సలు, అత్యవసర వైద్య సేవలు అందిస్తూ ప్రాణదానం చేస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో ప్రస్తుతం 28 మొబైల్ అంబులేటరీ క్లినిక్‌లు అత్యవసర సేవలు అందిస్తున్నాయి.

52వేల ఫోన్‌కాల్స్

ఉమ్మడి జిల్లా పరిధిలో 1962 హెల్ప్‌లైన్‌కు 52 వేల ఫోన్‌కాల్స్ వచ్చాయి. అందులో అనంతపురం జిల్లా నుంచి 28 వేలు, శ్రీసత్యసాయి జిల్లాలో 24 వేల కాల్స్ వచ్చాయని రెండు జిల్లాల ఇన్‌చార్జ్‌లు నరేష్, ముస్తాక్ అలీ తెలిపారు. పశుసంవర్ధకశాఖ అధికారులు, డాక్టర్ల సహకారంతో అనంతపురం జిల్లాలో 16 వేలు, సత్యసాయి జిల్లాలో 10 వేల పశువులు, గేదెలకు వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. 1962 సిబ్బంది సహకారంతో మారుమూల గ్రామాల్లో సైతం మెరుగైన పశువైద్య సేవలు అందిస్తున్నట్లు పశుశాఖ జిల్లా అధికారి వై.సుబ్రహ్మణ్యం తెలిపారు.



వైఎస్సార్ మొబైల్ అంబులేటరీ వాహనాలు

మేలో మెగా గృహప్రవేశాలు



కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకం కింద జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి మే రెండో వారంలో మెగా గృహప్రవేశాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. ఇళ్ల నిర్మాణ అంశంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ డీఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో పలు కారణాల వల్ల గృహ ప్రవేశ కార్యక్రమం వాయిదా పడిందన్నారు. ఈసారి నిర్ణయించిన సమయానికే కార్యక్రమం ఉంటుందన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి మెగా గృహప్రవేశ కార్యక్రమానికి సర్వం సిద్ధం చేసి ఉంచాలన్నారు. లక్ష్యాలు చేరుకోని అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ కేశవనాయుడు, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, సీపీఓ ప్రేమ్ చంద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మల్బరీ విస్తీర్ణం పెంపుపై దృష్టి

అనంతపురం అగ్రికల్చర్: లాభదాయకమైన మల్బరీ సాగును మరింత విస్తరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పట్టు పరిశ్రమ శాఖ తయారు చేసిన ఐదు రకాల పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టర్ల ద్వారా రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగం మాదిరిగా నెల నెలా రేషం ద్వారా ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ ఏడాది కొత్తగా 800 ఎకరాల్లో మల్బరీ పంటను సాగులోకి తేవాలని ప్రణాళిక తయారు చేసినట్లు జిల్లా అధికారి అంజనేయులు తెలిపారు. పుల్ల నాటుకునే దగ్గరి నుంచి పట్టుగూళ్ల మార్కెట్‌లో అమ్ముకునే దాకా ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ఉన్నందున సాగుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి బి.చంద్రానాయక్, ఏపీఎంఐపీ అధికారి ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

నేడు 'నవోదయ' పరీక్ష

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం (2023–24 విద్యాసంవత్సరం) శనివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు లేపాక్షి విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 8,774 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వారి కోసం 42 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

న్యూస్‌రీల్

చేతన్‌రెడ్డి కుటుంబానికి ఆర్థికసాయం



రూ.లక్ష చెక్కు అందజేస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: కండరాల క్షీణత వ్యాధితో బాధపడుతున్న చేతన్‌రెడ్డి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టర్ ఎం.గౌతమి రూ.లక్ష ఆర్థికసాయం చెక్కును శుక్రవారం కలెక్టరేట్‌లో అందజేశారు. ఈ నెల 26న నార్పలకు విచ్చేసిన ముఖ్యమంత్రి దృష్టికి తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లికి చెందిన కొండారెడ్డి తన మేనల్లుడు చేతన్‌రెడ్డి కండరాల క్షీణత వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తీసుకెళ్లాడు. బాలుని కుటుంబాన్ని ఆదుకోవాలన్న సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ పాల్గొన్నారు.

చిన్నారులకు మెరుగైన వైద్యం



పీడియాట్రిక్ వార్డును పరిశీలిస్తున్న ముస్కాన్ వైద్య బృందం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చిన్నారులకు మెరుగైన వైద్యసేవలందించాలని 'ముస్కాన్' వైద్య బృందం సూచించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వాస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసేందుకు డాక్టర్ అమిత్ మల్కర్ (మధ్యప్రదేశ్), డాక్టర్ మనోజ్‌కుమార్ (హర్యానా)తో కూడిన ముస్కాన్ బృందం శుక్రవారం అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిని సందర్శించింది. న్యూట్రిషన్ రీహ్యాబిలిటేషన్ సెంటర్ (ఎన్ఆర్‌సీ), పీడియాట్రిక్ వార్డు, ఓపీ, ఎస్ఎన్‌సీయూ వార్డులను తనిఖీ చేసింది. రికార్డులను పరిశీలించిన అనంతరం అక్కడ చిన్నారులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న వైద్యుల వివరాల గురించి డాక్టర్ సతీష్, సిబ్బంది సౌజన్య తదితరులతో ఆరా తీసింది. చిన్నారులకు పాలిచ్చేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో సౌకర్యాలు మెరుగుపరచాలని సూచించింది. చిన్నారులు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా చిన్నారులకు వైద్యసేవలు ఎలా ఉన్నాయి.. ఆరోగ్యం మెరుగుపడిందా.. ఆహారం.. పౌష్టికాహార నాణ్యతపై చిన్నారుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకుంది. రెండో రోజు శనివారం కూడా ఆస్పత్రిలో మరికొన్ని విభాగాలను పరిశీలిస్తామని వైద్య బృందం తెలిపింది. కార్యక్రమంలో పీడియాట్రిక్ హెచ్ఓడీ డాక్టర్ సుహాసిని, వైద్యులు డాక్టర్ ప్రవీణ్ దీన్, డాక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్కూళ్లలో 'పేరెంట్స్' సమావేశాలు



రాప్తాడు రూరల్: విద్యా సంవత్సరం (2022–23) ముగుస్తున్న నేపథ్యంలో శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు. సమావేశానికి సంబంధించి పలు సూచనలు చేస్తూ డీఈఓ సాయిరామ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశంలో విద్యార్థుల ప్రగతి నివేదికలను తల్లిదండ్రులకు అందజేయాలని పేర్కొన్నారు. టీచర్ తన సబ్జెక్టుకు చెందిన విద్యార్థుల ప్రగతిని విశ్లేషించి వివరణాత్మకంగా నివేదికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థీ విద్యా, విద్యేతర, పాఠ్యాంశంలోని ప్రగతి, సామర్థ్యాలు, ఏయే అంశాల్లో వెనుకబడ్డారో తల్లిదండ్రులకు తెలియజేస్తూ మెరుగుపరచుకోవడానికి సూచనలు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్యకర విషయాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశాల్లో మాస్కులు ధరించడం, భౌతిక దూరాన్ని పాటించడం, శానిటైజర్లను అందుబాటులో ఉంచడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేస్తూ వారి ప్రశ్నలకు గౌరవంగా సమాధానాలు ఇవ్వాలని సూచించారు. తల్లిదండ్రులతో ఏర్పాటు చేస్తున్న సమావేశాలు విద్యార్థుల్లో భరోసా, తల్లిదండ్రుల్లో నమ్మకం కల్గించాలనే ఉద్దేశమేనని డీఈఓ స్పష్టం చేశారు.

మే నుంచి పేదలకు జొన్నలు, రాగులు

- మొదటిగా 7 మండలాల్లో జొన్నలు
- 24 మండలాల్లో రాగుల పంపిణీకి చర్యలు
- కిలో రూపాయితో కార్డుకు గరిష్టంగా 3 కిలోలు



రేషన్ పంపిణీ దృశ్యం

అనంతపురం అర్బన్: పేదలకు పోష్టికాహారం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఫోలిక్ యాసిడ్, ఐరన్ పుష్కలంగా ఉన్న ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఇప్పటికే ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) – చౌక దుకాణాల ద్వారా అందిస్తోంది. తాజాగా మే ఒకటో తేదీ నుంచి జొన్నలు, రాగులు పంపిణీ చేయనుంది. ఇప్పటికే పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి జొన్నలను సేకరించగా.. కర్ణాటక ప్రభుత్వం నుంచి ఎఫ్‌సీఐ ద్వారా రాగులు కొనుగోలు చేస్తోంది. రైతులు కూడా వరికి ప్రత్యామ్నాయంగా చిరు ధాన్యాలు పండించేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. స్థానికంగానే రైతుల నుంచి చిరుధాన్యాల ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేసి పీడీఎస్ ద్వారా పంపిణీ చేయనున్నారు.

మొదటి దశలో...

జిల్లా వ్యాప్తంగా 1,545 చౌక ధరల దుకాణాల పరిధిలో 6,54,180 తెల్లకార్డులు ఉన్నాయి. వీటిలో 20,17,360 మంది సభ్యులు ఉన్నారు. మే నెల నుంచి కార్డుదారులకు జొన్నలు, రాగులు పంపిణీ చేయనున్నారు. తొలి దశలో గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ మండల లెవల్ స్టాక్ పాయింట్ల (ఎంఎల్ఎస్) పరిధిలోని ఏడు (గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, పామిడి, పెద్దవడుగూరు, వజ్రకరూరు, విడపనకల్లు) మండలాల్లో జొన్నలు పంపిణీ చేస్తారు. తొమ్మిది ఎంఎల్ఎస్ పాయింట్ల పరిధిలోని 24 మండలాల్లో రాగులు పంపిణీ చేయాలని నిర్ణయించారు.

కిలో రూపాయితో...

పేదలకు పౌష్టికాహారం అందించే విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూనే... అదే క్రమంలో వారిపై ఆర్థికభారం పడకుండా చూస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే బియ్యం ఉచితంగా అందిస్తోంది. జొన్నలు, రాగులు కిలో రూపాయితో ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్డుకు గరిష్టంగా మూడు కిలోలు జొన్నలు లేదా రాగులు ఇస్తారు. కార్డుదారులు తమకు ఇష్టమైనది తీసుకోవచ్చు.

పంపిణీకి చర్యలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు మే నెల నుంచి కార్డుదారులకు జొన్నలు, రాగుల పంపిణీకి చర్యలు చేపట్టాం. మొదటిదశ కింద ఏడు మండలాల్లో జొన్నలు, మిగిలిన 24 మండలాల్లో రాగులు పంపిణీ చేయాలని నిర్ణయించాం. ఇందుకుగాను 125 టన్నుల జొన్నలు, 1,250 టన్నుల రాగులు సిద్ధంగా ఉన్నాయి.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

ముందస్తు అడ్మిషన్లు చేపడితే చర్యలు

రాప్తాడు రూరల్: ఇంటర్ అడ్మిషన్లు ముందస్తుగా చేపట్టే కళాశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి సురేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ప్రిన్సిపాళ్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఇంటర్ బోర్డు ఉత్తర్వులు రాకముందే అడ్మిషన్లు చేసుకోరాదని సూచించారు. వేసవి సెలవుల్లో ప్రత్యేక కోచింగ్, సమ్మర్ క్లాసెస్ పేరుతో తరగతులు నిర్వహించకూడదన్నారు. అన్ని యాజమాన్యాల కళాశాలలు ప్రభుత్వ నిబంధనల మేరకే నడుచుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం జరిమానా విధించడంతో పాటు గుర్తింపు కూడా రద్దు చేసేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆలోచించి కాలేజీల్లో అడ్మిషన్లపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రలోభాలకు గురై విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించవద్దని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చిన తేదీల్లో పిల్లలను మీకు ఇష్టమైన కళాశాలల్లో చేర్పించుకోవాలని కోరారు.

చెరువులకు పునరుజ్జీవం



▲ పై చిత్రం నార్పల గ్రామ పంచాయతీ పరిధిలోని మడుగుపల్లి కనుమ చెరువు. ఏటా వర్షాలు విస్తారంగా పడుతున్నా ఈ చెరువులో చుక్క నీరు నిల్వ ఉండదు. చెరువు గట్టు అధ్వానంగా ఉండడంతో గండ్లు పడి వర్షపు నీరు మొత్తం దిగువకు వెళ్లిపోతోంది. దీంతో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మడుగుపల్లి కనుమ చెరువును ఎంపిక చేసి ఉపాధి హామీ కూలీలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ముళ్ల పొదల తొలగింపుతోపాటు గట్టు భద్రత పనులు పూర్తి చేశారు. వచ్చే నెలాఖరులోపు పూర్తిస్థాయిలో పూడికతీత పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. వర్షాకాలంలో ఈ చెరువులో పూర్తిస్థాయిలో నీరు నిండితే చెరువు దిగువనున్న వ్యవసాయ బోరు బావుల్లో భూగర్భజలాలు పూర్తి స్థాయిలో పెరిగే అవకాశం ఉండడంతోపాటు మూగజీవాల దాహార్తి సైతం తీరనుంది.


- జిల్లాలో 75 చెరువుల అభివృద్ధి
- ఉపాధి కూలీలతో పనులు
- వర్షాకాలం లోపు పనుల పూర్తి
- పెరగనున్న భూగర్భజలాలు

అనంతపురం టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి నోచుకోని చెరువులకు పునరుజ్జీవం కల్పించి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. చెరువులకు గట్లు తెగి వర్షాకాలంలో చుక్క నీరు నిల్వ లేకుండా పోతున్న పురాతనమైన చెరువులకు మహర్దశ తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టింది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'మన గ్రామం.. మన చెరువు' నినాదంతో ఆయా గ్రామాల ప్రజల సహకారంతో ఉపాధి హామీ పథకం నిధులను ఖర్చు చేసి చెరువుల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా అభివృద్ధికి నోచుకోని 75 చెరువుల్లో పూడిక తీత, ముళ్లపొదల తొలగింపుతో పాటు చెరువు గట్లు పటిష్టపరచి అభివృద్ధిలోకి తీసుకురానున్నారు. వర్షాకాలం పూర్తయ్యేలోపు ప్రతి చెరువులో పుష్కలంగా నీరుండే విధంగా చర్యలు చేపడుతున్నారు.

మండలానికి మూడు చెరువులు ఎంపిక

జిల్లా వ్యాప్తంగా 31మండలాల్లో చిన్న మండలాల్లో రెండు చెరువులు, పెద్ద మండలాల్లో మూడు చెరువులను ఎంపిక చేశారు. వర్షాకాలంలో ఎక్కువ నీరు చేరే చెరువులను మొదటి ప్రాధాన్యతగా తీసుకొని వాటిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రధానంగా డి.హీరేహాళ్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు, గుమ్మఘట్ట మండలంలోని నేత్రపల్లి, గార్లదిన్నె మండలంలోని కల్లూరు, నార్పల మండలంలోని శిద్దరాచెర్ల, అనంతపురం రూరల్ మండలంలోని కాట్నేకాలువ చెరువులతో పాటు ప్రతి మండలంలోనూ రెండు, మూడు చెరువుల్లో ఇప్పటికే అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. జూలై నెలాఖరులోపు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఎంపిక చేసిన చెరువుల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసి స్వాతంత్య్ర వేడుకలను ఆయా గ్రామాల ప్రజలతో కలిసి చెరువుల దగ్గరే నిర్వహించనున్నారు.

నాణ్యతగా పనులు



'మన ఊరు.. మన చెరువుల అభివృద్ధి మన చేతుల్లోనే' అనే నినాదంతో ఉపాధి కూలీలతో కలిసి చెరువుల్లో నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. జిల్లా వ్యాప్తంగా కొన్ని మండలాల్లో పిచ్చిమొక్కలతో నిండిపోయిన అధ్వాన స్థితికి చేరుకున్న పెద్ద పెద్ద చెరువులను అభివృద్ధిలోకి తీసుకొచ్చే విధంగా పనులు చేపడుతున్నాం. వర్షాకాలం ప్రారంభం లోపే చెరువుల్లో పనులు పూర్తయ్యే విధంగా ఒక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం.

– వేణుగోపాల్‌రెడ్డి, డ్వామా పీడీ



మడుగుపల్లి చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన పనుల వివరాలు తెలిపే బోర్డు

క్లుప్తంగా

దున్నపోతు బీభత్సం.. వృద్ధురాలి మృతి


భీమక్క (ఫైల్)

గుమ్మఘట్ట: దున్నపోతు దాడిలో భీమక్క (60) అనే వృద్ధురాలు చనిపోయారు. స్థానికుల వివరాల మేరకు.. గుమ్మఘట్ట మండలం కలుగోడు గ్రామానికి చెందిన బొమ్మక్కపల్లి రామాంజినేయులు ఆయన భార్య భీమక్క వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి నలుగురు కుమారులు. తమ పొలంలో సాగుచేసిన రాగినారును తింటున్న దున్నపోతును తోలేందుకు భీమక్క వెళ్లారు. దున్నపోతు ఒక్కసారిగా భీమక్కను కొమ్ములతో ఢీకొట్టింది. కొమ్ములపై ఆమెను ఎత్తుకుని నలువైపులా తిరుగుతూ బీభత్సం సృష్టించింది. చుట్టుపక్కల వారు గమనించేలోగా భీమక్క అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో చెల్లా చెదురైన మృతదేహాన్ని చూసి వారు తల్లడిల్లిపోయారు. దీంతో కలుగోడులో విషాదఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేసి బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు.

త్వరలో రైతుల చెంతకు 'నానో డీఏపీ'

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా రైతులకు త్వరలోనే 'నానో డీఏపీ' అందుబాటులోకి రానున్నట్లు 'ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్స్ కో ఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో) జిల్లా మేనేజర్ మణికళ్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే దేశవ్యాప్తంగా అందుబాటులోకి వస్తుందన్నారు. 50 కిలోల డీఏపీ బస్తా ధర రూ.1,350 ఉండటం, అది కూడా కొంచెం డిమాండ్ ఉన్నందున రైతులకు కొంచెం భారం పడిందన్నారు. అదే స్థాయిలో పోషకాలు కలిగిన ద్రవరూపంలో ఉండే 500 మి.లీ నానో డీఏపీ ధర రూ.600గా నిర్ణయించినట్లు తెలిపారు. అన్ని రకాలుగా నానో డీఏపీ రైతులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఇప్పటికే నానో యూరియా ద్వారా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. మామూలుగా 50 కిలోల యూరియా బస్తా రూ.267 వరకు ఉండగా... అదే నానో యూరియా 500 మి.లీ బాటిల్ ధర రూ.225 ప్రకారం అందుబాటులోకి వచ్చిందన్నారు. నానా లిక్విడ్ డీఏపీ, యూరియాల వాడకం ద్వారా పంటకు పోషక నాణ్యత, ఉత్పాదకత పెంపొందించడంలో చాలా ప్రభావంతమైందిగా గుర్తించినట్లు తెలిపారు.

నార్పల టు లడఖ్


బైక్ యాత్రలో బాలు

- యువకుడి సాహసయాత్ర
- 177 రోజులు బైక్‌పై పయనం
- 10,020 కిలోమీటర్ల సుదీర్ఘ రైడ్

అనంతపురం డెస్క్ : మనం బైక్‌పై వంద, రెండు వందల కిలోమీటర్లు తిరగ్గానే బాగా అలసిపోతాం. బైక్‌లో కంటే బస్సులోనో, రైల్లోనో వెళ్లి ఉంటే బాగుండేదని అనుకుంటాం. కానీ ఆ యువకుడు అలా ఆలోచించలేదు. బైక్‌పై దేశాన్ని చుట్టేయాలన్న తన కోరికను నెరవేర్చుకునేందుకు ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాడు. ఒకట్రెండు కాదు..ఏకంగా 177 రోజులు బైక్‌యాత్ర చేపట్టాడు. 10,020 కిలోమీటర్ల సుదీర్ఘదూరం ప్రయాణించాడు. అందరితో శభాష్ అనిపించుకున్న ఆ యువకుడే నార్పల మండల కేంద్రానికి చెందిన యనమచింతల బాలకృష్ణ అలియాస్ బాలు.

ఆసక్తే ముందుకు నడిపించింది..

బాలు తల్లిదండ్రులు నార్పలలో హోటల్ నిర్వహిస్తున్నారు. అతను కూడా మొబైల్ సర్వీస్ సెంటర్‌తో పాటు టూర్స్ అండ్ ట్రావెల్స్ ఏజెన్సీ ఏర్పాటు చేసుకున్నాడు. మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) చదివినప్పటికీ ఉద్యోగం చేయాలన్న ఆసక్తి లేదు. బైక్‌పై సుదూర ప్రాంతాలకు, కొత్త ప్రదేశాలకు వెళ్లిరావడం హాబీగా మలచుకున్నాడు. ఈ క్రమంలోనే గతంలో రామేశ్వరం, ఊటీతో పాటు కర్ణాటకలోని పలు ప్రదేశాలను బైక్‌పై వెళ్లి చూసొచ్చాడు. గోదావరి పుష్కరాల సందర్భంగా రాజమండ్రికి కూడా వెళ్లాడు. ఈ కోవలోనే లడఖ్ యాత్రను కూడా విజయవంతంగా పూర్తి చేసి పలువురి మన్ననలు పొందాడు.

సెకండ్ హ్యాండ్ బైక్‌పై యాత్ర

బాలు లడఖ్ యాత్రకు అపాచీ 200 సీసీ సెకండ్ హ్యాండ్ బైక్ పై 2022 జులై 13న నార్పల నుంచి బయలుదేరాడు. మొదట శ్రీశైల మల్లన్నను దర్శించుకుని యాత్ర కొనసాగించాడు. హైదరాబాద్, నాగపూర్, ఝాన్సీ, గ్వాలియర్, ఆగ్రా, ఢిల్లీ, కురుక్షేత్ర, చండీగఢ్, అమృతసర్, జమ్మూ, చీనాబ్ బ్రిడ్జ్, శ్రీనగర్, కార్గిల్ మీదుగా లడఖ్ చేరుకున్నాడు. మార్గమధ్యంలోని ప్రముఖ ప్రదేశాలను సందర్శించి..వాటికి సంబంధించిన వివరాలు సేకరించాడు. లడఖ్ నుంచి తిరుగు ప్రయాణంలో హిమాచల్‌ప్రదేశ్ మీదుగా కాంగ్రా, ధర్మశాల, జ్వాలాముఖి, నైనాదేవి, కేదర్‌నాథ్‌కు వెళ్లాడు. తర్వాత ఢిల్లీ, మహారాష్ట్ర, తెలంగాణ మీదుగా ఈ ఏడాది జనవరి ఐదో తేదీన నార్పలకు చేరుకున్నాడు. సుదీర్ఘయాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని వచ్చిన బాలును గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. బైక్ యాత్రలో భాగంగా బాలు పలు వీడియోలు చిత్రీకరించాడు. వాటిలో కొన్నింటిని తన యూట్యూబ్ చానెల్ (బాలు సన్‌రైజ్ ట్రావెలర్)లో అప్‌లోడ్ చేశాడు.

ఆదుకున్న జవాన్లు

ప్రపంచంలోనే రెండవ అత్యంత చల్లని ప్రదేశమైన ద్రాస్ వద్ద (కార్గిల్‌కు సమీపంలో) మైనస్ 10 డిగ్రీల చలిని తట్టుకోలేక బాలు తీవ్ర జ్వరం బారిన పడ్డాడు. దగ్గరలోని వైద్యశాలకు వెళ్లి చూపించుకోగా.. మూడు రోజుల విశ్రాంతి తీసుకోవాలని డాక్టరు సూచించారు. అప్పుడు ఎక్కడ ఉండాలో తెలియని పరిస్థితి. అలాంటి సమయంలో భారత ఆర్మీ జవాన్లు తమ క్యాంపులో ఉండటానికి చోటు కల్పించారు. ఆరోగ్యం కుదుట పడేవరకు బాగా చూసుకున్నారు. ఆరోగ్యం మెరుగుపడగానే బాలు యాత్ర కొనసాగించాడు. కాగా.. బాలు తీసుకెళ్లిన నగదును జమ్మూలోని డార్మెటరీలో దొంగలు అపహరించారు. దీంతో తల్లిదండ్రులు, స్నేహితులు ఆన్‌లైన్‌లో డబ్బు పంపి ఆదుకున్నారు.

ఎవరెస్ట్‌కు వెళ్లాలనుంది

నాకు బైక్ రైడింగ్‌తో పాటు ట్రెక్కింగ్ కూడా ఇష్టమే. కాలేజీ రోజుల్లో తరచూ ట్రెక్కింగ్ వెళ్లేవాడిని. ఎవరెస్ట్‌ను అధిరోహించాలన్నది లక్ష్యం. కనీసం బేస్ క్యాంపు దాకా వెళ్లినా నా లక్ష్యం నెరవేరినట్టే. బైక్‌యాత్రలో ఎన్నో అద్భుతమైన ప్రదేశాలను సందర్శించా. ఎక్కడా హోటల్‌లో విడిది చేయలేదు. డార్మెటరీలు, ఆలయాలు, గురుద్వారాల్లో విడిది చేస్తూ వెళ్లా. దీనివల్ల తక్కువ బడ్జెట్‌లోనే యాత్ర పూర్తి చేయగలిగా. వాఘా, సుచిత్‌ఘర్, కార్గిల్ దగ్గర.. ఇలా మూడుచోట్ల పాకిస్తాన్ బార్డర్‌ను చూడడం మరచిపోలేని అనుభూతి. – బాలకృష్ణ, నార్పల


ఇండియా - పాకిస్తాన్ బార్డర్ వద్ద బాలు

స్కూల్‌కు వెళ్తూ పరలోకాలకు...

- రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


రవికుమార్ (ఫైల్)

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని గాజులపల్లికి చెందిన వరిమడుగు రవికుమార్ (30) అనే ఉపాధ్యాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు.. గాజులపల్లికి చెందిన రవికుమార్ గుత్తి పట్టణంలోని శ్రీసాయి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇందులో భాగంగానే రవికుమార్‌తో పాటు గుత్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మనీషా కూడా ద్విచక్ర వాహనంలో గుత్తికి బయలు దేరారు. అయితే కర్నూలు వైపు నుంచి వచ్చిన ట్యాంకర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవికుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, మనీషాకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ విద్యార్థినిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుత్తి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెలవులో జెడ్పీ సీఈఓ

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) కె.భాస్కర్‌రెడ్డి సెలవులో వెళ్లారు. ఈ మేరకు ఆయన శుక్రవారం డిప్యూటీ సీఈఓ అమృతరాజ్‌కు లీవ్ లెటర్‌ను అందజేశారు. వెంటనే శాఖాపరమైన సిమ్‌ను కూడా డిప్యూటీ సీఈఓకు అందజేసి వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. ఆయన మళ్లీ వస్తారా? లేదా? అనే అంశం ఇప్పుడు జెడ్పీ ఉద్యోగుల్లో హాట్ టాపిక్ అయింది.

జిల్లా సీనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక రేపు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా సీనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలను ఈ నెల 30న స్థానిక ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి శశికాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఎంపిక కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సీనియర్ స్త్రీ, పురుషుల విభాగాల్లో ఈవెంట్ల వారీగా ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు మే 5న గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలన్నారు.

బేస్‌బాల్ జిల్లా క్రీడాకారుల ఎంపిక రేపు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా సీనియర్ పురుషుల, మహిళల బేస్‌బాల్ క్రీడాకారుల ఎంపికను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమోహన్, నరసింహానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికను స్థానిక ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తామన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు మే 13 నుంచి 15 వరకు ఆర్ట్స్ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 99598 47080, 93472 17905 నంబర్లకు సంప్రదించాలన్నారు.

2న జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా సీనియర్ పురుషులు, మహిళల టెన్నిస్‌బాల్ క్రికెట్ జట్టు ఎంపికను మే 2న నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నిస్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అన్వర్‌బాషా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలను స్థానిక నీలం సంజీవరెడ్డి క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తమ ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు మే 8, 9 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


మౌనిక (ఫైల్)


కావ్య (ఫైల్)

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధికి చెందిన మౌనిక (15) అనే ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాలమేరకు... ఒంటిమిద్ది గ్రామానికి చెందిన వెంకటరెడ్డి, సునీత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె మౌనిక ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో రెండు సబ్జెక్టులు ఫెయిల్ అయింది. దీంతో తీవ్ర మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో అందరూ నిద్ర పోయాక పురుగుల మందు తాగింది. శుక్రవారం తెల్లవారు జామున అపస్మారక స్థితిలో ఉన్న మౌనికను హుటా హుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మౌనిక చనిపోయిందని నిర్ధారించారు. ఎంతో అల్లారు ముద్దుగా పెరిగిన కుమార్తె విగాత జీవిగా పడి ఉండటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

తాడిపత్రిలో...

తాడిపత్రి: రూరల్ పరిధిలోని బిందెల కాలనీలో నాగేంద్ర, లక్ష్మినరసమ్మ దంపతుల రెండో కుమార్తె కావ్య (18) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో కావ్య ఫెయిల్ అయింది. శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుంది. అయితే ఇంటి తలుపులు మూసివేయకపోవడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మట్కా, బెట్టింగులను నిర్మూలించాలి

- నేర సమీక్షలో ఎస్పీ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు

అనంతపురం: జిల్లాలో మట్కా, క్రికెట్ బెట్టింగులను నిర్మూలించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం జిల్లాలోని ఎస్ఐ, ఆపై స్థాయి పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రమైన (గ్రేవ్) కేసుల్లో దోషులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు న్యాయం జరగాలంటే నేరం జరిగాక ఘటనా స్థల పరిశీలన, సాక్ష్యాధారాల సేకరణ, కేసు నమోదు, నిందితుల అరెస్ట్, దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు వంటివి కీలకమని వివరించారు. నేరాలు మానుకోని వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించాలన్నారు. జిల్లా బహిష్కరణలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక ప్రాంతాల్లో చిన్న సమస్యలూ తలెత్తకుండా అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీలు చైతన్య, నరసింగప్ప, బి. శ్రీనివాసులు, ఆంథోనప్ప, ఆర్ల శ్రీనివాసులు, ఎస్. మహబూబ్ బాషా, శ్రీనివాసులు (ఏఆర్), సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో అనారోగ్యానికి చెక్

- కలెక్టర్ ఎం.గౌతమి



చిరు ధాన్యాలతో తయారు చేసిన కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ గౌతమి

రాప్తాడు: 'మారుతున్న ఆహారపు అలవాట్లతో మానవుడు అనేక రుగ్మతలకు లోనవుతున్నారు.. చిరుధాన్యాలను తీసుకోవడం వల్ల అనారోగ్యాలు దూరమై సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది' అని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీ శిక్షణ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మిల్లెట్ మహోత్సవ్ (చిరుధాన్యాల ఫుడ్ ఫెస్టివల్)ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు, ఐసీడీఎస్ అంగన్‌వాడీ కార్యకర్తలు చిరుధాన్యాలతో ఆహార పదార్థాలను తయారు చేయడం మంచి పరిణామమన్నారు. చిరుధాన్యాలతో బీపీ, షుగర్, రక్తహీనత లాంటి వ్యాధులకు చెక్ పెట్టొచ్చన్నారు. వారంలో ఒక రోజు మిల్లెట్ డేగా కేటాయించుకుని కేవలం చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను మాత్రమే తీసుకోవాలన్నారు. అనంతరం చిరుధాన్యాలతో చేసిన వంటలను కలెక్టర్‌తో పాటు ఐసీడీఎస్ పీడీ బి.ఎన్.శ్రీదేవి, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి రుచి చూసి చాలా రుచిగా ఉన్నాయని, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రశంసించారు. అనంతరం మూడున్నర ఎకరాల్లో 8 క్వింటాళ్లు అండు కొర్రలు పండించిన రైతు రాజశేఖర్‌రెడ్డిని కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో డీపీఎం లక్ష్మానాయక్, ఎల్‌డీఎం నాగరాజ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజురావు, శాస్త్రవేత్తలు సహదేవ రెడ్డి, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

విశ్వఖ్యాతి.. అనంత నృత్య రీతి

- ఖండాంతరాలు దాటిన 'అనంత' నృత్యం
- నేడు అంతర్జాతీయ నృత్యదినోత్సవం

కరువు సీమలో కళలకు కొదవలేదని నిరూపించారు అనంత నృత్యకారులు. మైసూరు వరద రాజ అయ్యంగార్ శాస్త్రీయ నృత్యకళను అనంత వాసులకు పరిచయం చేశారు. అప్పటి నుంచి ఇక్కడి నృత్యకారులు ప్రదర్శనలతో, తమ ప్రతిభా పాటవాలతో అనంత కీర్తిని ఖండాంతరాలు దాటించారు. జానపద, వెస్ట్రన్ రీతులతో అందరినీ మంత్రముగ్ధులను చేస్తున్నారు. అనంత నుంచి అంతర్జాతీయ స్థాయికి చేరిన అనంత నాట్య ప్రస్థానాన్ని ఇక్కడి నాట్యాచార్యులే కాదు.. నృత్యకళను అంకిత భావంతో సాధన చేస్తున్న చిన్నారులూ ఘనంగా చాటుతున్నారు. ఏప్రిల్ 29న అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.


విదేశాలలో అనంత చిన్నారుల నృత్య హేల (ఫైల్)


చిన్నజీయర్ స్వామీజీతో సోమనాథ్ (ఫైల్)

అనంతపురం కల్చరల్: 1955 సంవత్సరానికి ముందు అనంతలో ఎలాంటి నాట్యరీతులు చెప్పించడానికి ప్రత్యేక గురువులంటూ ఉండేవారు కాదు. మైసూరు నుంచి అనంతకు విచ్చేసిన వరదరాజ అయ్యంగార్ అనే శాస్త్రీయ నృత్యకారుడు లలితకళా పరిషత్తులో 'భరతనాట్యం' చెప్పించడానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో ఎల్కేపీ కార్యదర్శిగా ఉన్న పీఎస్ శర్మ ఆయన్ను ప్రోత్సహించి శాస్త్రీయ నృత్యాన్ని అనంత వాసులకు పరిచయం చేశారు. తన కుమార్తె సంధ్యామూర్తిని మూడేళ్ల ప్రాయం నుంచే సంప్రదాయ నృత్యంలో రాణించేలా శిక్షణ ఇప్పించారు. అప్పట్లో శిక్షణా సంస్థలు ఉండేవికావు. కృష్ణకుమార్ అనే నృత్యకారుడు లలితకళాపరిషత్తులో, అప్పారావు మాస్టర్ కృష్ణకళా మందిరంలో శిక్షణ ఇచ్చేవారు.

ఎల్లలు దాటిన 'అనంత' నృత్యం

శాస్త్రీయ నృత్యానికి పునాదులేసిన వరదరాజ అయ్యంగార్, అప్పారావు, కృష్ణకుమార్ తదితర గురువులు తొలిరోజుల్లో అనంతలో అద్భుతమైన కళాకారులను తీర్చిదిద్దారు. అనంతర కాలంలో ప్రముఖ నాట్యాచార్యులుగా రాణిస్తున్న సంధ్యామూర్తి 1979లో నగరంలోని కమలానగర్‌లో నాట్యకారిణి 'శ్రీ నృత్యకళానిలయం' ఏర్పాటు చేశారు. వేలాది మందికి శాస్త్రీయ నృత్యరీతులపై శిక్షణ ఇచ్చారు. జాతీయ స్థాయికే పరిమితమైన అనంత నాట్యాన్ని 2013లో దుబాయ్ వేదికగా పరిచయం చేశారు. 2014లో సింగపూర్, 2015లో థాయ్‌లాండ్, 2019లో మలేషియా దేశాల్లోనూ ఆమె శిష్యబృందం ఎన్నో అవార్డులు అందుకుంది. అనంత వేదికగా సంధ్యామూర్తి 2015లో 'సహస్ర దశదేవతా నృత్యారాధన' పేరుతో ఏకకాలంలో పదిగంటల పాటు 155 మంది కళాకారులతో నిర్విరామ నృత్యం చేయించారు. అలాగే 2020లో మరోసారి 'సారంగలాసిత' పేరుతో అనంత నాట్యాన్ని ప్రపంచ రికార్డుల్లో నమోదు చేశారు.

నాట్య ప్రతిభకు పట్టం కట్టిన 'పట్నం'

తొలుత సంధ్యామూర్తి వద్ద శిక్షణ పొందిన పట్నం శివప్రసాద్, అనంతర కాలంలో వెంపటి చినసత్యం వద్ద శిక్షణ పొంది 'గురు కృప సంగీత నృత్యకళానికేతన్' స్థాపించి కూచిపూడి నాట్యంలో జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. ఆయన శిష్యుడు సోమనాథ భరద్వాజ్ సంప్రదాయ కూచిపూడి నాట్యంలో అనేక అవార్డులు,రివార్డులు పొందుతున్నాడు. అలాగే కృష్ణమూర్తి రాజు, సురేష్ మాస్టర్, పద్మావతి వంటి శాస్త్రీయ నాట్యకళాకారులే కాకుండా వెస్ట్రన్, ఫోక్ స్టైల్‌లో రాణిస్తున్న కత్తి విజయ్ కుమార్, మక్బుల్‌బాషా, విష్ణు, వన్నూరు, హరిప్రసాద్ నాట్యానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. సోమనాథ్ భరద్వాజ్ నాట్య కళాకారులకు ప్రభుత్వం ఇచ్చే స్కాలర్‌షిప్పు పొందుతున్న ఏకైక కళాకారుడు కావడం విశేషం. నగరంలో వినాయక నృత్యకళానిలయం స్థాపించిన విజయ్‌కుమార్, కూచిపూడి కళాకేంద్రం స్థాపించిన కృష్ణమూర్తి రాజు, అరవింద నృత్య శిక్షణాలయం పేరుతో సురేష్ మాస్టర్, పద్మావతి తదితరులు అనంత కళాకారులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. కళాసాగర్ కత్తి విజయ్‌కుమార్ 30 ఏళ్లగా అన్ని రకాల డాన్సుల్లో శిక్షణ ఇస్తున్నాడు. ప్రపంచ ప్రఖ్యాత కళాకారులు నటరాజ రామకృష్ణ, శోభానాయుడు, డీవై సంపత్‌కుమార్, పద్మిని, రాగిణి తదితర ప్రముఖులు అనంతకు విచ్చేసిన సందర్భాల్లో ఇక్కడివారి ప్రతిభను మెచ్చుకున్నారు.



పురస్కారాలనందుకుంటున్న సంధ్యామూర్తి (ఫైల్)

నేడు నాట్య దినోత్సవ వేడుకలు:

జిల్లా డాన్స్‌మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక లలితకళాపరిషత్తులో నాట్య హంగామా సృష్టిస్తున్నారు. అందరూ డాన్సు మాస్టర్లు ఒకే వేదికపై చేసే అన్ని రకాల డాన్సులతో నటరాజుకు నీరాజనాలర్పిస్తారని ఎల్కేపీ కార్యదర్శి పద్మజ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు జరిగే నృత్య వేడుకల్లో కళాభిమానులు పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

అంధ విద్యార్థులకు 'అమ్మ' చేయూత



కాస్మోటిక్స్ అందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, అమ్మ రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: స్థానిక అరవిందనగర్‌లోని అంధ విద్యార్థుల ఆశ్రమంలో 'అమ్మ' సంస్థ నిర్వహించిన సేవా కార్యక్రమాన్ని దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు చేతులమీదుగా రూ.25 వేల విలువ చేసే కాస్మోటిక్స్, విద్యా సామగ్రి శుక్రవారం అందించారు. అమ్మ రమణారెడ్డి మాట్లాడుతూ సేవాభావం ఉన్న అధికారిగా శ్రీనివాసులుకు ఎంతో పేరుందన్నారు. ఆయన అందించిన స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి సేవలను డీఎస్పీ కొనియాడారు.

అక్రమ మద్యం పట్టివేత

ఆత్మకూరు: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌చార్జ్ ఎస్‌ఐ రవిప్రసాద్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం కొండపల్లికి చెందిన రామాంజనేయులు నుంచి శుక్రవారం 23 అక్రమ మద్యం బాటిళ్లనుస్వాధీనం చేసుకొని, అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

నిముషాంబాదేవి జయంతి వేడుకలు



అలంకరణలో నిముషాంబాదేవి

అనంతపురం కల్చరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన నిముషాంబాదేవి జయంతి వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక పాతూరు చెరువు కట్టపై వెలసిన అమ్మవారి ఆలయంలో శుక్రవారం నిముషాంబా మాతకు విశేష అలంకార సేవలు జరిగాయి. భక్తులు బారులు తీరి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు రమేష్ మాట్లాడుతూ ఈనెల 30న నిముషాంబామాత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. ఆదివారం ఉదయం గణపతి, నవగ్రహ, చండీహోమాలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం ఉత్సవ ఊరేగింపు ఉంటాయని తెలిపారు. పాతూరు రాణి నగర్‌లో వెలసిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు కూడా 30న జరుగనున్నట్లు నిర్వాహకులు ప్రకాష్‌ఆచారి తెలిపారు.


ప్రతిపక్షాలు మెచ్చుకునేలా పాలన



స్టిక్కర్లు అందిస్తున్న నాయకులు

ఆత్మకూరు: గత ప్రభుత్వాల్లో కేవలం తమ పార్టీకి చెందిన వారికే ప్రభుత్వ పథకాలు అందించేవారని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ప్రతిపక్షాలు కూడా మెచ్చుకునేలా పాలన కొనసాగుతోందని మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బాలపోతన్న తెలిపారు. శుక్రవారం మండల వ్యాప్తంగా జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు



చిన్నారులతో శ్రీచైతన్య పాఠశాలల సిబ్బంది

రాప్తాడురూరల్: నగరంలోని వివిధ ప్రైవేట్ స్కూళ్లలో శుక్రవారం ఘనంగా చిన్నారుల 'గ్రాడ్యుయేషన్' వేడుకలు జరిగాయి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో జరిగిన వేడుకలకు చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పర్వీన్, డీన్ చంద్రమోహన్, ప్రైమరీ జోనల్ ఇన్‌చార్జ్ పూజ, మాధవి, ప్రీప్రైమరీ ఇన్‌చార్జ్ కోమలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విన్సెంట్ ఫెర్రర్ నగర్‌లోని మోక్షిత్ పాఠశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్ వేడుకల్లో కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి చేతుల మీదుగా చిన్నారులకు పత్రాలను అందించారు.

ప్లాస్టిక్‌తో అనర్థం

అనంతపురం క్రైం: ప్లాస్టిక్‌తో అనర్థమని, ప్రతి ఒక్కరూ ముందుచూపుతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించకూడదని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన పూడికను తీయించేలా డిప్యూటీ మేయర్ చర్యలు తీసుకున్నారు. పూడికలో అధిక శాతం ప్లాస్టిక్ వ్యర్థాలే కన్పించాయని తెలిపారు. వినియోగించిన ప్లాస్టిక్‌ను కాలువల్లో, ఎక్కడపడితే అక్కడ పడేయడం సరికాదన్నారు.

ఆజాద్‌నగర్ అభివృద్ధికి చర్యలు

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: ఆజాద్‌నగర్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 40వ డివిజన్‌లోని ఆజాద్‌నగర్‌లో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో లబ్ధిపొందిన వారి ఇళ్లకు ఎమ్మెల్యే వెళ్లారు. ప్రతి ఇంటికీ చేకూరిన లబ్ధిని తెలియజేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఓపిగ్గా విన్నారు. డివిజన్‌లోని ఆజాద్‌నగర్, సత్యదేవనగర్‌లో సీఎం ప్రత్యేక నిధుల్లో భాగంగా రూ.25 లక్షలతో మూడు సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం: వర్షం వస్తే మురుగు ఇళ్ల ముందే నిలుస్తోందని స్థానికులు ప్రమీల, నాగజ్యోతి, రెహాన, తదితర మహిళలు ఎమ్మెల్యేకి తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అవసరమున్న ప్రాంతాల్లో ఆరు కల్వర్టులు ఏర్పాటు చేయాలని కమిషనర్ రమణారెడ్డి, డీఈ నరసింహులను ఎమ్మెల్యే ఆదేశించారు. సొంత స్థలం ఉన్న వారు ఇళ్లు నిర్మించుకుంటే వారికి రూ.1,80,000 మొత్తాన్ని దశలవారీగా ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. అమ్మఒడి ద్వారా తమ పిల్లల భవిష్యత్తుకు మార్గం చూపిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి సార్ మేలు మరువలేమని ఆజాద్‌నగర్‌కు చెందిన సమీహ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అమ్మఒడి, చేదోడు, ఆసరా ద్వారా వచ్చిన డబ్బులతో తన ఇద్దరి పిల్లల భవిష్యత్తుకు ఉపయోగిస్తున్నానని, మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలని నాగజ్యోతి ఆనందాన్ని పంచుకుంది. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, జేసీఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, చింతకుంట మధు, స్థానిక నాయకులు ఖాదర్, షరీఫ్, గుజ్జల లక్ష్మణ్, నల్లప్ప, పార్వతి, రాధాయాదవ్, కార్పొరేటర్లు ఇస్సాక్, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమమే జగనన్న ధ్యేయం



పోస్టర్లను పంపిణీ చేస్తున్న నాయకులు

రాప్తాడు: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించడమే జగనన్న లక్ష్యమని వైస్ ఎంపీపీ, జేసీఎస్ ఇన్‌చార్జ్ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ అన్నారు. మండల కేంద్రం రాప్తాడులో శుక్రవారం 'జగనన్న మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి ఇంటింటికీ వెళ్లి పలకరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సాకే చంద్ర, జయన్న, చిరుతల నాగేంద్ర, ముత్యాలు, సచివాలయ కన్వీనర్లు అభి పాల్గొన్నారు.

విశ్రాంత అంగన్‌వాడీ కార్యకర్తకు సన్మానం



విశ్రాంత అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతిని సన్మానించిన దృశ్యం

అనంతపురం క్రైం: నెహ్రూపూర్‌మెన్ కాలనీ–2లో అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతిని సీడీపీఓ లలితమ్మ శుక్రవారం సన్మానించారు. సీడీపీఓ లలితమ్మ మాట్లాడుతూ పద్మావతి చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విష్ణువర్ధిని, విజయ, కొండమ్మ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సు తప్పనిసరి



అగ్రి ఇన్‌పుట్ డీలర్లకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రోజా పుష్పలత, విశ్రాంత ఏడీఏ చంద్రమౌళి

అనంతపురం అగ్రికల్చర్: అగ్రికల్చర్ ఇన్‌పుట్స్ డీలర్లుగా కొనసాగుతున్న వారు తప్పనిసరిగా ప్రభుత్వం నిర్దేశించిన అగ్రికల్చర్ డిప్లొమా కోర్సు పూర్తి చేయాలని స్థానిక భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ రోజా పుష్పలత తెలిపారు. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్‌ఐ) కోర్సు చేస్తున్న జిల్లాకు చెందిన 40 మంది డీలర్లు, కోర్సు కోఆర్డినేటర్, విశ్రాంత ఏడీఏ చంద్రమౌళి శుక్రవారం వ్యవసాయ అనుబంధ ప్రయోగశాలలైన భూసార పరీక్ష కేంద్రం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పరీక్షా కేంద్రం, జీవ నియంత్రణ ప్రయోగశాలలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పరీక్షలు, విశ్లేషణలపై డీలర్లకు అవగాహన కల్పించారు. వ్యవసాయ రంగం, పంటలు, తెగుళ్లు, రైతుల పరిస్థితిపై అవగాహన లేకుండా వ్యాపారం చేస్తే సమస్యలొస్తాయి. దీంతోపాటు రైతులకు పెట్టుబడి భారం పెరిగి వ్యవసాయంలో నష్టాలు సంభవించే పరిస్థితి ఉంటుందని తెలిపారు.

'పేదలపై భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వం'

అనంతపురం అర్బన్: పేదలపై కేంద్ర ప్రభుత్వం ధరల భారం మోపుతోందని ఏపీ మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతీ ప్రసాద్, పద్మావతి ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక కళ్యాణదుర్గం రోడ్డు సమీపంలోని పార్వతమ్మ కాలనీలో సమాఖ్య ఆధ్వర్యంలో వంట గ్యాస్ ధర తగ్గించాలని గ్యాస్ సిలిండర్లతో నాయకులు, మహిళలు నిరసన తెలిపారు. సమాఖ్య నగర గౌరవాధ్యక్షులు కమ్మక్క అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడారు. వంట గ్యాస్ ధరను కేంద్ర ప్రభుత్వం రూ.1,200 చేసి పేదలపై ఆర్థిక భారం మోపిందన్నారు. ఇదే క్రమంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేద, మధ్య తరగతి వర్గాలపై మరింత భారం వేస్తోందన్నారు. ప్రజలపై భారం మొపుతున్న బీజేపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకురాళ్లు జానకి, కుళ్లాయమ్మ, గిరిజమ్మ, రమాదేవి, లక్ష్మి, సులోచన, రాధిక, మనోరమ, భాగ్య, వతంత, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ దెబ్బతినకుండా పనులు చేయాలి



డీఈ నరసింహకు సూచనలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగరంలో ఎక్కడబడితే అక్కడ అడ్డదిడ్డంగా గుంతలు తీస్తే ఎలా? తాగునీటి పైప్‌లైన్ దెబ్బతినకుండా పనులు జాగ్రత్తగా చేయించాలని నిర్వాహకులు, అధికారులను మేయర్ వసీం ఆదేశించారు. శుక్రవారం స్థానికుల ఫిర్యాదు మేరకు నగరంలోని 37వ డివిజన్‌లో మేయర్ వసీం పర్యటించారు. తాగునీటి పైప్‌లైన్‌లు దెబ్బతినకుండా పనులు చేపట్టాలన్నారు. కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, ఇస్సాక్, డీఈ నరసింహులు, నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు : నగరంలోని పలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధం చేపడుతున్న నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి బృందం నగరంలోని భవనీనగర్‌లో ఓ నిర్మాణదారుడు రోడ్డును ఆక్రమించి మెట్లు నిర్మించాడు. పలుసార్లు హెచ్చరించినా మార్పు రాకపోవడంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది మెట్లను తొలగించారు. హౌసింగ్ బోర్డులో అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న గదులను టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు.

నగదు అపహరణ

అనంతపురం: విజయనగర కాలనీలో ఉన్న శ్రీనిధి ఐరన్‌మార్ట్‌లో నగదు ఎత్తుకెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున దుకాణం పైకప్పు రేకులను తొలగించి క్యాష్ బాక్స్‌లో ఉంచిన రూ.85 వేలు నగదు ఎత్తుకెళ్లారు. ఉదయం దుకాణం తెరిచేందుకు వెళ్లిన యజమాని చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆస్పత్రి తనిఖీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిని శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్‌ఎంఓ డాక్టర్ వైవీరావు, డాక్టర్ పద్మజ, హెచ్‌ఓడీలు భీమసేనాచారి, రామస్వామినాయక్, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, రజిని పాల్గొన్నారు.





వేసవిలోనూ వానహోరు!

ఏప్రిల్ నెల ముగిసి మే నెల ప్రారంభం కానుంది. ఎండలు మండుతున్నాయి. సాయంత్రం వరకు మండే ఎండ. సాయంత్రం నుంచి ఉక్కపోత ఉంటోంది. ఇంట్లో ఉంటే ఫ్యాను, బయటకొస్తే చెట్టు నీడ ఉండాల్సిందే. శుక్రవారం సాయంత్రం నుంచివాతావరణం మారింది. అప్పటి వరకు మండుతున్న ఎండ.. ఒక్కసారిగా మేఘాలు కమ్ముకోవడంతో వాతా వరణం చల్లబడింది. రాత్రికి వానహోరుతో అనంత నగరం తడిసి ముద్ద య్యింది. సాయినగర్ ఏడో రోడ్డు, అశోక్‌నగర్ వీధులు వర్షపు నీటితో నిండిపోయాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

మే 1 నుంచి వ్యక్తిత్వ వికాస శిక్షణ

అనంతపురం కల్చరల్: చిన్నారుల్లో నైతిక విలువలు, దేశభక్తిని నిర్మాణం చేయడమే లక్ష్యంగా రామకృష్ణ సేవా సమితి ప్రత్యేక వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులను నిర్వహిస్తోందని సంస్థ ప్రధాన కార్యదర్శి గుత్తి శ్రీధరమూర్తి తెలిపారు. మే 1 నుంచి 10 వరకు స్థానిక మొదటిరోడ్డు శారదా బాలికల పాఠశాల ప్రాంగణంలో శిక్షణ ఉంటుందన్నారు. ప్రార్థనా గీతాలు, యోగా, మేధాసూక్తం, స్వామి వివేకానంద సూక్తులు, ప్రభావిత వ్యక్తుల కథలతో పాటూ స్పోకెన్ ఇంగ్లిష్ కూడా ఉంటుందన్నారు. వేసవి సెలవులను విద్యార్థుల్లో ఉపయుక్తంగా మార్చడానికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. వివరాలకు సెల్: 9440006439, 9440488388లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

అనంతపురం క్రైం: 40వ డివిజన్‌లో ఆజాద్‌నగర్‌లో శనివారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నడిమివంక బ్రిడ్జ్ దాటిన తర్వాత కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డు, ఆజాద్‌నగర్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

బాలికను వంచించిన కేసులో ఇద్దరి అరెస్ట్

అనంతపురం: నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో నాలుగు రోజుల క్రితం బాలికను వంచించిన కేసులో మోహిత్ , మదన్‌మోహన్ రెడ్డి అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రవిశంకర్ రెడ్డి తెలిపారు. నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. బాలికను ప్రేమపేరుతో వంచించడమే కాకుండా మోసగించాలని చూశారని తెలిపారు. ఈ నేపథ్యంలో వీరిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామన్నారు.

రీసర్వేపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

అనంతపురం క్రైం: రీ సర్వేను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కమిషనర్ రమణారెడ్డి టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆయన మాట్లాడారు. ఓపెన్ లే అవుట్ల వివరాలను త్వరితగతిన పూర్తి చేసి, ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ప్రతి అసెస్‌మెంట్‌దారుడితో 16 ఏ ఫారంను పూర్తి చేయించాలని, రీసర్వేకు సంబంధించి వచ్చే నెల 1న వార్డు సభలను ఏర్పాటు చేయాలని అడ్మిన్, ప్లానింగ్ కార్యదర్శులను టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ ఆదేశించారు.

గుత్తా హరికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం

అనంతపురం కల్చరల్: శ్రీ వేంకట పద్మావతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శతజయంతి వేడుకల సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన వ్యక్తులకు జాతీయ పురస్కారాలు అందిస్తున్నారు. అందులో భాగంగా జిల్లాకు చెందిన సాహిత్య సేవా కార్యకర్త, కవి గుత్తా హరిని ఎన్టీఆర్ జాతీయ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ నందిపాటి చక్రపాణి, భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సి.నారాయణస్వామి వివరాలను వెల్లడించారు. ఇటీవల సాహితీ బ్రహ్మోత్సవాల పేరిట నిర్వహించిన కళా ప్రదర్శనలు ప్రపంచ రికార్డు అందుకుంది. ఈ సందర్భంగా గుత్తా హరికి ప్రత్యేక ప్రశంస అందిస్తున్నామన్నారు.

రైతు భరోసాకు నమోదు చేయించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ వెంకటేశ్వరప్రసాద్

రాప్తాడురూరల్: కొత్తగా పాసు బుక్ వచ్చిన ప్రతి రైతూ 'రైతు భరోసా' నమోదు చేయించుకోవాలని అనంతపురం మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర ప్రసాద్ కోరారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం కందుకూరు, ఉప్పరపల్లి, ఆకుతోటపల్లి గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఓతో పాటు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి మాట్లాడారు. రైతులందరూ పీఎంకిసాన్ ఈకేవైసీ, ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలన్నారు. సమావేశంలో ఏఈఓ మురళి, వీఏఏ పద్మావతి, వీహెచ్ఏ లక్ష్మీదేవి, సర్పంచ్ ప్రశాంత్‌కుమార్, సావిత్రి శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

వినియోగదారుల సేవా కేంద్రం ప్రారంభం

అనంతపురం సిటీ: అనంతపురం ఆదిమూర్తినగర్‌లోని వేమన టెలిఫోన్ భవన్‌లో బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన వినియోగదారుల సేవాకేంద్రాన్ని ఆ శాఖ జనరల్ మేనేజర్ ముజీబ్ పాషా శుక్రవారం ప్రారంభించారు. కొత్త సిమ్‌కార్డులు, రీచార్జ్, రీప్లేస్‌మెంట్, ల్యాండ్‌లైన్ హైస్పీడ్, ఇంటర్‌నెట్ వంటి సేవలన్నీ ఇక్కడ పొందొచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం బాలగంగాధర్‌రెడ్డి, ఏజీఎం బాలాజీ, ఎస్‌డీఈలు వేణుగోపాల్, రామ్మూర్తినాయక్, ఆ శాఖ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలుగులోనూ రైల్వే టికెట్ బుకింగ్

- ఫోన్‌లో యూటీఎస్ యాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం
- అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్‌లో సరికొత్త సేవలు
- ఆన్‌లైన్, యాప్‌ల్లో జనరల్ టికెట్ల బుకింగ్ ఇక సులువు
- రైల్వేస్టేషన్లలో క్యూలైన్ల బాధలకు చెక్


క్యూలైన్‌లో రైల్వే టికెట్ కోసం నిలబడి ఉన్న ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: జనరల్ టికెట్ కోసం ఆదరాబాద రాగా రైల్వేస్టేషన్‌కు చేరుకుని.. చాంతాడంత పొడవు ఉండే క్యూలైన్లలో నిలబడి.. ఈలోపు తాము ఎక్కాల్సిన రైలు వెళ్లిపోతుందేమోనని ఆదుర్దా పడేవారే ఎక్కువ. ఇలా ఇబ్బందులు పడే ప్రయాణికుల కోసం రైల్వే శాఖ నాలుగేళ్ల క్రితం అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్)ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. యూటీఎస్ విధానంలో యాప్, వెబ్‌సైట్ ద్వారా రైలు టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే ఇంగ్లిష్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు దీన్ని ప్రాంతీయ భాషలకు కూడా రైల్వే శాఖ విస్తరించింది. దీంతో తెలుగు సహా వివిధ ప్రాంతీయ భాషల్లోనూ టికెట్లు బుక్ చేసుకోవచ్చు. సాధారణ (జనరల్) రైలు టికెట్లను దిగువ శ్రేణి ప్రయాణికులు ఎక్కువగా తీసుకుంటారని.. వీరి కోసం ప్రాంతీయ భాషల్లో యాప్‌ని తీసుకొస్తే వినియోగం మరింత పెరుగుతుందనే ఉద్దేశంతో రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.

ఎలాంటి శ్రమ లేకుండా యాప్ నుంచే..

యూటీఎస్ యాప్ ద్వారా ఎలాంటి శ్రమ లేకుండా మొబైల్ ఫోన్ నుంచే జనరల్ టికెట్ పొందొచ్చు. అయితే టికెట్ బుక్ చేసుకోవడానికి ఇంగ్లిష్ మాత్రమే అందుబాటులో ఉండటంతో గ్రామీణులు, పెద్దగా చదువుకోనివారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సులభంగా యాప్ వినియోగించేలా ప్రాంతీయ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. దీంతో ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, హిందీ, కన్నడం, మలయాళం, మరాఠీ, ఒడియా, తమిళ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దీనిద్వారా జనరల్ టికెట్‌తో పాటు ప్లాట్‌ఫామ్ టికెట్ కూడా కొనుగోలు చేయొచ్చు. అలాగే సీజన్ టికెట్ బుకింగ్, రెన్యువల్ సైతం చేసుకోవచ్చు. యూటీఎస్ యాప్‌లో ప్రాంతీయ భాషల అప్‌డేట్ వెర్షన్‌ను ఆండ్రాయిడ్, ఐవోఎస్ రెండింటిలోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. హార్డ్ కాపీ, పేపర్‌లెస్ టికెట్.. రెండు ఆప్షన్లు ఉన్నాయి.

యూటీఎస్ యాప్

ఎన్ని భాషల్లో: తెలుగు, ఇంగ్లిష్, కన్నడం, మలయాళం, హిందీ, తమిళం, ఒడియా, మరాఠీ
దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న రైల్వేస్టేషన్లు: 9,120
డౌన్‌లోడ్ చేసుకున్నవారు: 10 మిలియన్లకు పైగా
యాప్ ద్వారా రోజుకు బుక్ అవుతున్న టికెట్లు: 2.34 లక్షలు
రోజూ వినియోగిస్తున్న ప్రయాణికులు: 14.21 లక్షల మంది

స్టేషన్‌కు 5 కి.మీ. పరిధిలో..



మొబైల్‌లోని జీపీఎస్ ఆధారంగా యూటీఎస్ యాప్ పనిచేస్తోంది. టికెట్ బుక్ చేసుకునే సమయంలో మొబైల్ జీపీఎస్ లొకేషన్ ఆన్‌లో ఉండాలి. రైల్వేస్టేషన్ ఆవరణకు 30 మీటర్ల నుంచి 5 కి.మీ. పరిధిలో ఉన్న ప్రయాణికులు మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. అంతేకాకుండా యాప్ ద్వారా 3 నెలలు, 6 నెలలు లేదా సంవత్సరానికి సీజన్ టికెట్లను తీసుకోవచ్చు. ఎక్స్‌ప్రెస్, మెయిల్, ప్యాసింజర్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు యూటీఎస్ టికెట్ బుకింగ్ చెల్లుబాటు అవుతుంది.
– అనూప్‌కుమార్ సత్పతి, డీఆర్‌ఎం, వాల్తేరు

ఆ సంఘాల ఆందోళనలకు దూరంగా ఉందాం

- గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు
- ఒకే విడతన 1.34 లక్షల ఉద్యోగాలిచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- సచివాలయ ఉద్యోగులకు, ప్రభుత్వం మధ్య సుహృద్భావ వాతావరణం ఉంది
- కొన్ని సంఘాలు స్వార్థం కోసం దానిని చెడగొట్టడానికి చూస్తున్నాయి
- సచివాలయాల ఉద్యోగులందరూ గమనించాలి
- ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనవద్దు

సాక్షి, అమరావతి : స్వార్థ ప్రయోజనాల కోసం కొన్ని ఉద్యోగ సంఘాలు చేపట్టిన ఆందోళనలకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు దూరంగా ఉండాలని గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ యూనియన్ పిలుపునిచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి, ఒకే విడతలో లక్ష మందికి పైగా ఉద్యోగాలిచ్చి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని తెలిపింది. అలాంటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని ఉద్యోగ సంఘాలు శనివారం నిర్వహించతలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనవద్దని తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య సుహృద్భావ వాతావరణం ఉందని, కొన్ని ఉద్యోగ సంఘాలు స్వార్థ, రాజకీయ అవసరాలకు ఆ వాతావరణాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, ఉద్యోగులందరూ దీనిని గమనించాలని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, అదనపు ప్రధాన కార్యదర్శి బీఆర్ ఆర్ కిషోర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకే నోటిఫికేషన్ ద్వారా 1.34 లక్షల గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగాలను భర్తీ చేసి, ఇచ్చిన మాట ప్రకారం ప్రొబేషన్ డిక్లేర్ చేసి అందరినీ శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా రెగ్యులర్ చేసిన సీఎం జగన్‌కు సచివాలయాల ఉద్యోగులందరూ ఎప్పటికీ కృతజ్ఞులుగానే ఉంటారని పేర్కొన్నారు. ఉద్యోగులు కోరిన విధంగా 010 పద్దు కింద జీతాలు ఇచ్చారని, డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో నెగిటివ్ మార్కులు తొలగించారని, మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులు, శానిటేషన్ సెక్రటరీలకు వీక్లీ ఆఫ్‌లు ఇచ్చారని తెలిపారు. సచివాలయాల ఉద్యోగులకు అనేక మేళ్లు జరిగాయంటే సీఎం జగన్‌కు మనపై ఉన్న ప్రేమాభిమానాలే కారణమని చెప్పారు.

బదిలీలపై గందరగోళం సృష్టిస్తున్నారు

సచివాలయాల ఉద్యోగులు చాలా మంది వివిధ కారణాలతో బదిలీలు కోరుకుంటున్నారని తెలిసిన వెంటనే సీఎం జగన్ అంగీకారం తెలిపారన్నారు. సచివాలయాల మహిళా ఉద్యోగులు పెళ్లి చేసుకుని కుటుంబానికి దూరంగా ఉంటూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తే.. కొన్ని ఉద్యోగ సంఘాల నాయకులు రిక్వెస్టు బదిలీలు కాదని, సాధారణ బదిలీలు జరపాలని వితండ వాదం చేస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్ల సర్వీస్ పూర్తయి బదిలీ కావాలని కోరుకున్నా ట్రాన్స్‌ఫర్ చేయకూడదని, మూడేళ్ల సర్వీస్ పూర్తయిన వారందరినీ బదిలీ చేయాలని వాళ్లు డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సచివాలయాల ఉద్యోగులందరినీ బదిలీ చేయమని చెప్పడానికి వీళ్లెవరని నిలదీశారు. బదిలీ వద్దనుకొనే ఉద్యోగిని కూడా బలవంతంగా బదిలీ చేయమనడానికి వీళ్లకేం హక్కుందన్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకే సాధారణ బదిలీ చేయడం సంప్రదాయంగా వస్తోందని, ఇప్పుడు సచివాలయ ఉద్యోగులకు మాత్రం మూడేళ్లకే సాధారణ బదిలీలు చేయమని ఉద్యోగ సంఘం నాయకులు ఎలా అడుగుతారని అన్నారు. గందరగోళం సృష్టించి బదిలీ ప్రక్రియను అడ్డుకోవడానికి కొందరు జేఏసీల పేరుతో ఉద్యోగులను రెచ్చగొడుతున్నారని తప్పుపట్టారు. దీనిని అందరూ గమనించాలని కోరారు. సచివాలయాల ఉద్యోగులు ఆ ధర్నాలు, నిరసనలు, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు.

వేదాలు విజ్ఞాన భాండాగారాలు

- రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్
- ఘనంగా శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం
- ఇద్దరికి మహా మహోపాధ్యాయ, ఇద్దరికి వాచస్పతి పురస్కారాలు
- 539 మందికి డిగ్రీ పట్టాలు ప్రదానం


స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్

తిరుపతి ఎడ్యుకేషన్: వేదాలు విజ్ఞాన భాండాగారాలని, ఆధునిక మానవ సమాజం శాంతి, సౌఖ్యాలతో జీవించడానికి వీటిలోని అంశాలు ఎంతగానో దోహదం చేస్తాయని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చెప్పారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 7వ స్నాతకోత్సవం శుక్రవారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. వర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ ఈ స్నాతకోత్సవానికి హాజరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన వేద పండితులు వి.సుబ్రహ్మణ్య శాస్త్రి సలక్షణ ఘనాపాఠి, చెన్నైకి చెందిన ఆర్. మణి ద్రావిడ శాస్త్రికి మహా మహోపాధ్యాయ పురస్కారాలను గవర్నర్ ప్రదానం చేశారు. అన్నవరానికి చెందిన కె. రామ సోమయాజి శాస్త్రి, మైసూరుకు చెందిన సి.వంశీకృష్ణ ఘనాపాఠికి వాచస్పతి పురస్కారాలను అందజేశారు. సర్టిఫికెట్ కోర్సుల నుంచి పీహెచ్‌డీ వరకు వేద విద్యనభ్యసించిన 539 మందికి డిగ్రీ పట్టాలను అందజేశారు. గవర్నర్ మాట్లాడుతూ.. వేలాది సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు గణిత, వైజ్ఞానిక, ఆర్థిక, సాంకేతిక, జ్యోతిష్య శాస్త్రాలను వేదాల్లోని వైదిక అంశాలతో మేళవించి ప్రపంచానికి తెలియజేశారన్నారు. భారతీయ సంప్రదాయం, ఆధునిక శాస్త్ర సాంకేతికత మధ్య సమన్వయం పెంపొందించుకోగలిగితే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ రాధే శ్యాం, ఈసీ సభ్యులు హరే కృష్ణ శతపతి, ఫణి యాజులు తదితరులు పాల్గొన్నారు.

కడప దర్గాను దర్శించుకోవడం నా అదృష్టం

కడప కల్చరల్/రాజంపేట/ఒంటిమిట్ట: మతసామరస్యానికి ప్రతీక అయిన కడప అమీన్‌పీర్ దర్గాను దర్శించుకోవడం తన అదృష్టమని, ఇది దైవం కల్పించిన మహాభాగ్యంగా భావిస్తున్నానని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన కడప పెద్ద దర్గాకు వచ్చారు. దర్గాలో గవర్నర్ పూలచాదర్ సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గవర్నర్ వెంట ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, కడప నగర మేయర్ సురేష్‌బాబు, కలెక్టర్ విజయరామరాజు ఉన్నారు.

ఒంటిమిట్ట రాములోరిని దర్శించుకున్న గవర్నర్

ఒంటిమిట్టలోని కోదండరాముడిని గవర్నర్ అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు. గవర్నర్‌కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేశ్, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. గవర్నర్ వైఎస్సార్ జిల్లా పర్యటన ముగించుకుని ఒంటిమిట్ట నుంచి సాయంత్రం 6.03 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. శనివారం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో సమూల మార్పులు

- ఈ ఏడాది నుంచి రీస్ట్రక్చర్.. సిలబస్ రీడిజైన్
- ఈ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి చర్యలు
- ఫ్యాప్సీ అవార్డుల సన్నాహక కార్యక్రమంలో ఆర్థిక మంత్రి బుగ్గన




మాట్లాడుతున్న ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

సాక్షి, విశాఖపట్నం: ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో సమూల మార్పులు తీసుకొస్తున్నట్లు ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రీస్ట్రక్చర్‌తో పాటు సిలబస్‌ను రీడిజైన్ చేస్తామని తెలిపారు. శుక్రవారం విశాఖలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫ్యాప్సీ) ఎక్స్‌లెన్స్ అవార్డ్స్–2023 సన్నాహక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యాభ్యాసం చేసిన వారు నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, ఆటోమొబైల్ రంగాల్లో వీరు తమ నైపుణ్యంతో రాణించేలా తయారు చేస్తామని చెప్పారు. వాణిజ్యం, పారిశ్రామికాభివృద్ధితోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఐటీఐల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో 192 స్కిల్ హబ్‌ల్లో మెరికలు తిరిగే కోర్సులను డిజైన్ చేశామని, వీటి ద్వారా వేలాది మంది యువతకు నైపుణ్య శిక్షణను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. అర్హులైన పారిశ్రామికవేత్తలకు ఫ్యాప్సీ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. కొత్త పారిశ్రామిక పాలసీలో కొన్ని మార్పులు చేయాలని కొంతమంది అభిప్రాయపడుతున్నారని, దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి అవసరమైతే మార్పులు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇండస్ట్రియల్ హోదా కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులను కూడా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధిలో వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు కీలకపాత్ర ఉందన్నారు. ఫ్యాప్సీ రాష్ట్ర అధ్యక్షుడు జాస్తి కరుణేంద్ర మాట్లాడుతూ ఫ్యాప్సీ ఎక్స్‌లెన్స్–2023 అవార్డుల కోసం జూలై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 11 కేటగిరీల్లో ఈ అవార్డులుంటాయని, ఈ అవార్డులు ఇవ్వడానికి 11 మంది పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని తెలిపారు. ఈ అవార్డులను ఆగస్టు ఆఖరు లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ప్రదానం చేస్తామని చెప్పారు.అనంతరం అవార్డుల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫ్యాప్సీ ఉపాధ్యక్షుడు కంకటాల మల్లికార్జునరావు, మాజీ అధ్యక్షుడు అచ్యుతరావు, ఎఫ్‌టీసీసీఐ సీఈవో ఖ్యాతి తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీలకు దీటుగా ఉద్యాన వర్సిటీ

- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


అకడమిక్ బ్లాక్, హాస్టళ్లను ప్రారంభిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల

రైల్వేకోడూరు: ఐఐటీలు, ఎన్‌ఐటీలకు దీటుగా ఉద్యాన, వ్యవసాయ వర్సిటీలను తీర్చిదిద్దుతామని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. అన్నమయ్య జిల్లా అనంతరాజుపేటలోని వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో రూ.22.81 కోట్లతో నిర్మించిన అకడమిక్ బ్లాక్, రెండు గర్ల్స్ హాస్టళ్లు, ఒక బాయ్స్ హాస్టల్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఉత్పత్తుల ఎగ్జిబిషన్ భవనాలను శుక్రవారం మంత్రి కాకాణి ప్రారంభించారు. వనిపెంటలోని కేవీకే అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటుచేసిన ఉద్యాన వర్సిటీ అంచెలంచెలుగా ఎదుగుతోందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ అభివృద్ధికి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్రంలో 10,778 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల పరిధిలోనే విలువ ఆధారిత ఉత్పత్తుల యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అనంతరాజుపేట కళాశాలలో రైతుల వసతిగృహం, అతిథిగృహం ఏర్పాటుచేయాలని మంత్రిని కోరారు. వైఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ టి.జానకీరాం మాట్లాడారు. అనంతరం పుట్టగొడుగుల సాగుపుస్తకం, కరపత్రాలు, అంబాజీపేట పరిశోధనా స్థానం రూపొందించిన కొబ్బరి సాగుకు సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

- తన జల్సాలను ప్రశ్నిస్తున్నాడని భర్తను హత్య చేసిన జమలమ్మ
- ఎన్టీఆర్ జిల్లాలో ఘటన

విజయవాడ స్పోర్ట్స్ : తన జల్సాలకు అడ్డుపడుతున్న భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ ఎనిమిదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.లక్ష్మీ శుక్రవారం తీర్పు చెప్పారు. 2016 నవంబర్ 23న కొత్తపేట (టూ టౌన్) పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఈ ఘటన అప్పట్లో నగర ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన జమలమ్మకు జి.కొండూరు మండలం వెంకటాపురానికి చెందిన ఏడుకొండలు(32)కు 16 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొన్నాళ్లకు జమలమ్మ చెడు వ్యసనాలకు బానిసైంది. వీటిపై ప్రశ్నిస్తున్న భర్త ఏడుకొండలును అడ్డు తొలగించుకోవాలనే నిర్ణయాన్ని తన చెల్లెలు లక్ష్మికి వివరించింది. అదే గ్రామంలో హత్య చేస్తే అనుమానం వస్తుందనే ఉద్దేశంతో కాపురాన్ని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పి.నైనవరం గ్రామానికి మార్చింది. అంబాపురంలో కొత్త ఇంట్లోకి ప్రవేశించిన రోజునే చెల్లెలు లక్ష్మి, న్యూఆర్‌ఆర్ పేటకు చెందిన ఒడియార్ గణేష్, జక్కంపూడికి చెందిన బాలసాని తిరుపతి సాయంతో జమలమ్మ తన భర్త ఏడుకొండలు మెడకు తాడు చుట్టి చంపేసిందని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. మూడు రోజుల తర్వాత ఆ గది నుంచి వస్తున్న దుర్వాసనను పసిగట్టిన ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో జమలమ్మకు కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. మిగిలిన నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో నిర్దోషులుగా విడుదలయ్యారు.

చైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతి చెందిన వాణి

పెనమలూరు : శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మృతి చెందింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం ప్రకాశం పంతులు నగర్‌కు చెందిన జగన్నాథం వాణి(17) కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం బైపీసీ చదువుతోంది. గత రెండు రోజుల కిందట ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరం ఒక సబ్జెక్ట్ ఫెయిల్ అయింది. కాగా గురువారం వాణి సోదరుడు రాము కాలేజీ హాస్టల్‌కు వచ్చి వాణితో మాట్లాడి వెళ్లాడు. అయితే శుక్రవారం ఉదయం కాలేజీ హాస్టల్‌లో స్టడీ అవర్‌కు రావాల్సిన వాణి రాలేదు. దీంతో ఆమె కోసం రూమ్‌కు వెళ్లి మిత్రులు చూడగా ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని మృతి చెంది ఉంది. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రాజకీయ స్వార్థంతో జరిగే ఉద్యమంలో పాల్గొనం

గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్

సాక్షి, అమరావతి: రాజకీయ స్వార్థంతో జరిగే ఉద్యమాల్లో పాల్గొనబోమని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వంపై పోరాటం చేసే విధంగా కొన్ని శక్తులు సచివాలయ ఉద్యోగులను రెచ్చ గొడుతున్నాయని తెలిపింది. సచివాలయ ఉద్యోగులు వారి మాటలకు ప్రభావితం కావొద్దని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా, ప్రధాన కార్యదర్శి పుట్టి రత్నం, ఉపాధ్యక్షులు సిరిపురం హరి, కె.రామకృష్ణా రెడ్డి, జి.హరీంద్ర, కె.కిరణ్, బి.పుల్లారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడానికి కొందరు కుట్ర చేస్తున్నారని, ఇలా కుట్ర పన్నిన వారెవ్వరూ తమకు ఉద్యోగాలివ్వలేదని చెప్పారు. తమను ఉద్యోగులుగా గుర్తించని వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్న సచివాలయ ఉద్యోగుల ఐక్యతను దెబ్బతీయడానికి చేస్తున్న కుట్రను ఖండిస్తున్నట్లు తెలిపారు.

ఏపీ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

అధ్యక్ష , కార్యదర్శులుగా కె.వైధురిదేవి, ఎ.సుస్మిత


ఎన్నికైన సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షురాలిగా కె.వైధురి దేవి, ఉపాధ్యక్షురాలిగా ఎం.లక్ష్మణ కుమారి, కార్యదర్శిగా ఎ.సుస్మిత, అదనపు కార్యదర్శి(జనరల్)గా ఎం.రాజేశ్వరి, అదనపు కార్యదర్శి (కల్చరల్)గా ఎస్.నాగ లలితాదేవి, సంయుక్త కార్యదర్శిగా కె.సునీత, కోశాధికారిగా టి.శారద ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కె.విజయలక్ష్మి, డి.సాహిత్య వ్యవహరించనున్నారు. ఈ ఎన్నికల వివరాలను ఎన్నికల అధికారి ఎస్.శాంతి కుమారి శుక్రవారం ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమాఖ్య అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన ఉద్యోగుల హక్కుల రక్షణకు చర్యలు

ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

సాక్షి, అమరావతి: గిరిజన ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు చెప్పారు. పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఎస్టీ ఉద్యోగుల సర్వీసు సమస్యలపై గురు, శుక్రవారాల్లో విజయవాడలోని ఎస్టీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ విచారణ నిర్వహించింది. ఈ విచారణకు అధ్యక్షత వహించిన రవిబాబు మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల సమస్యలపై ఏడు శాఖలకు చెందిన అధికారులను పిలిచి విచారించినట్లు తెలిపారు. గిరిజన ఉద్యోగులకు న్యాయం జరిగే విధంగా సూచనలు చేసినట్లు చెప్పారు. గిరిజన ప్రజల నివాస, వ్యవసాయ భూముల సమస్యలపై కూడా విచారణ చేసి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. రాష్ట్రంలో గిరిజన ప్రజలు, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్టీ కమిషన్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ కార్యదర్శి డాక్టర్ గంగాధర్, డిప్యూటీ డైరెక్టర్ పొట్లూరి పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తుల విలువ పెంపుతో గిరి రైతు మనుగడ

- అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ జగన్నాథరావు
- కనుల పండువగా విత్తనాల పండగ

డుంబ్రిగుడ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏజెన్సీలో పంటల ఉత్పత్తుల విలువ హెచ్చింపుతోనే గిరిజన రైతులకు మనుగడ ఉంటుందని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ జగన్నాథరావు అన్నారు. డుంబ్రిగుడ మండలం కిల్లోగుడ గ్రామంలో సంజీవని సంస్థ, ధింసా గిరిజన ఉత్పత్తిదారుల సంఘం సంయుక్తంగా శుక్రవారం జీవ వైవిధ్య జాతరలో భాగంగా విత్తనాల పండగను ఘనంగా నిర్వహించింది. గిరిజన రైతుల సంప్రదాయ విత్తనాలతో పాటు ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలు సంస్థల ప్రతినిధులు దేశీయ విత్తనాల స్టాళ్లను ప్రదర్శించారు. డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ పాత విత్తనాల ద్వారా గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న అన్ని పంటల్లోనూ పోషక విలువలు అధికంగా ఉన్నాయన్నారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సురేష్‌కుమార్, రైతు సాధికారత సంస్థ రీజినల్ టెక్నికల్ అధికారి ఎం.సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఉద్యోగ విప్లవం

- ఒకే వేదికపై 761 మందికి ఆఫర్ లెటర్స్
- తల్లిదండ్రుల సమక్షంలో ఉద్యోగ పత్రాలు


తల్లిదండ్రులకు నమస్కరిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): అమ్మానాన్నల పాదాలకు విద్యార్థులు నమస్కరించారు. తమ అభ్యున్నతికి అహరహం శ్రమించిన తల్లిదండ్రులను విశ్వవిద్యాలయం వేదికగా విద్యార్థులే సత్కరించారు. ఈ అరుదైన సంఘటన గురువారం ఆంధ్రవిశ్వవిద్యాలయం (ఏయూ)లో కనిపించింది. విశాఖపట్నం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సైన్స్ కళాశాల అచీవర్స్ డే దీనికి వేదికైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగ విప్లవానికి వేదికగా నిలిచింది. ఏయూలో ఉద్యోగాలు సాధించిన 761 మంది విద్యార్థులకు ఆ వేదికపై నియామక పత్రాలను అందించే కార్యక్రమాన్ని ఏయూ నిర్వహించింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఆంధ్రవిశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఆచార్య హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఏయూ రాష్ట్రానికి ఆదర్శంగా, విశ్వవిద్యాలయాలకు మార్గదర్శిగా నిలుస్తోందని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రత్నాల్లాంటి పిల్లలను పెంచి విశ్వవిద్యాలయానికి పంపిన తల్లిదండ్రులందరినీ సన్మానించడం చూసి గర్విస్తున్నామన్నారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తామని చెప్పారు. వర్సిటీలో ప్రతి విద్యార్థి ఉద్యోగ సాధన, ఉపాధి కల్పన చేసే స్థాయికి ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షిస్తున్నారని, దీన్ని సాకారం చేసే దిశగా ఏయూ పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి ఇచ్చే నిజమైన సంపద విద్య అని ముఖ్యమంత్రి ఇదే వేదిక నుంచి అన్నారని గుర్తుచేశారు. క్రమశిక్షణతో మీ పిల్లలను పెంచినందుకు మీ అందరికీ వందనం అంటూ తల్లిదండ్రులకు నమస్కరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గతేడాది 81 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, ఈ సంవత్సరం దీన్ని అధిగమించే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఆర్.రెడ్డి తదితరులు ప్రసంగించారు.

ఆన్‌లైన్ గేమ్‌లో రూ.2 లక్షల నష్టం.. బీటెక్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ఫీజుల పేరుతో పెదనాన్న, బాబాయిల దగ్గర్నుంచి నగదు వసూలు
- ఆన్‌లైన్‌లో లుడో ఆడి డబ్బులు పోగొట్టుకున్న వైనం
- ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చేర్పించిన స్థానికులు

బాపట్లటౌన్ : ఆన్‌లైన్ గేమ్ మోజులో పడి బీటెక్ విద్యార్థి రూ.2 లక్షలు నష్టపోయి చివరకు ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. కర్లపాలెం మండలం చింతాయపాలేనికి చెందిన తాళ్లూరి వెంకటనారాయణ విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 27న ఉదయం ఆన్‌లైన్‌లో లుడో గేమ్ తన స్నేహితులతో కలిసి ఆడాడు. ఈ గేమ్‌లో తొలుత రూ.100 పెట్టుబడికి రూ.1000 వరకు వచ్చాయి. ఇదే మోజులో సాయంత్రం వరకూ ఆడుతూనే ఉన్నాడు. ఇంతలో పాకెట్‌మనీ నిమిత్తం చేతిలో ఉంచుకున్న రూ.30 వేలు పోయాయి. తర్వాత తన స్నేహితుడి వద్ద రూ.70 వేలు, తన పెదనాన్న, బాబాయిలకు ఫోన్ చేసి కళాశాలలో ఫీజు చెల్లించాలంటూ నమ్మబలికి మరో రూ.లక్ష వరకూ తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో విడతల వారీగా రూ.2 లక్షలు కోల్పోయాడు. దీంతో ఏం చేయాలో పాలుపోక శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి రైలు మార్గాన బాపట్ల చేరుకున్నాడు. అప్పటికే ఎలుకల పేస్ట్ తిన్నాడు. రైల్వేస్టేషన్‌లో తీవ్ర ఇబ్బంది పడుతుండటాన్ని ప్రయాణికులు గమనించి స్టేషన్‌మాస్టర్ సాయంతో ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు.